
# శభాష్ దీప్తి

## పారాలింపిక్స్ కాంస్య విజేతకు కేటీఆర్ అభినందన




హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పారిస్ పారాలింపిక్స్ మహిళల 400 మీటర్ల టీ20 పరుగు పందెంలో కాంస్యం సాధించిన జివాంజీ దీప్తిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణకు చెందిన దీప్తి అసమాన ప్రతిభతో రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచావు అని ఆయన ఎక్స్ వేదికగా కొనియాడారు. 'ఆడపిల్లలు తమ అసమానమైన శక్తి సామర్థ్యాలతో ఎంతటి ఆనందాన్ని తల్లితండ్రులకు ఇస్తారో ఆడపిల్ల తండ్రిగా నాకు తెలుసు. ఎన్ని కష్టాలున్నా సరే దీప్తి తల్లితండ్రులు మాత్రం ఆమె మీద నమ్మకం ఉంచటం గొప్ప విషయం. తల్లితండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ దీప్తి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచింది' అని ఆయన పేర్కొన్నారు.

# సెమీస్‌లో అమెరికా కుర్రోళ్లు




యూఎస్ ఓపెన్ నుంచి జ్వెరెవ్ నిష్క్రమణ

న్యూయార్క్: సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో యూఎస్‌ఏకే చెందిన డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ నిష్క్రమించినా అమెరికన్ల ఆధిపత్యం కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో యూఎస్‌ఏ కుర్రాళ్లు టేలర్ ఫ్రిట్జ్, ఫ్రాన్సిస్ టియాఫో ముఖాముఖి తలపడనున్నారు. క్వార్టర్స్‌లో ఫ్రిట్జ్.. 7-6 (7/2), 3-6, 6-4, 7-6 (7/3)తో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించాడు. మరో క్వార్టర్స్‌లో టియాఫో.. 6-3, 6-7 (7/5), 6-3, 4-1తో గ్రిగొర్ దిమిత్రోవ్ (బల్గేరియా)ను చిత్తుచేశాడు. మహిళల సింగిల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కిన్వెన్ జెంగ్ (చైనా) 1-6, 2-6తో రెండో సీడ్ అరీనా సబలెంక (బెలారస్) చేతిలో చిత్తై క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. సెమీస్‌లో సబలెంక.. అమెరికా యువ సంచలనం ఎమ్మా నవరోతో తాడో పేడో తేల్చుకోనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీస్ చేరిన రోహన్ బోపన్న (భారత్), అల్దిలా సుత్జిజాది (ఇండోనేషియా) ద్వయం 3-6, 4-6తో టౌన్‌సెండ్-యంగ్ (అమెరికా) చేతిలో పరాభవం పాలైంది.

# షూటర్ల పతక ధమాకా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: గోవా వేదికగా జరిగిన ఇండియా ఓపెన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ షూటర్లు పతక ధమాకా మోగించారు. పురుషుల 50మీ రైఫిల్ త్రి పొజిషన్ ఈవెంట్‌లో మణిదీప్ జెట్టా రెండు స్వర్ణ పతకాలతో మెరిశాడు. పురుషుల జూనియర్ 50మీ రైఫిల్ త్రీ ప్రోన్ విభాగంలో రయాన్ ఫైజల్ పసిడి సొంతం చేసుకున్నాడు. మరోవైపు 10మీ ఎయిర్ పిస్టల్ జూనియర్‌తో టీమ్ ఈవెంట్‌లో అర్పిత కరార్ రెండు స్వర్ణాలు సాధించింది. ప్రణతి(రజతం, కాంస్యం), గోపాల కృష్ణ(కాంస్యం), శంకర్(రజతం) ఆకట్టుకున్నారు. పతక విజేతలను తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అభినందించింది.

## రాజస్థాన్ హెడ్‌కోచ్‌గా ద్రావిడ్!

జైపూర్: టీమ్ఇండియా మాజీ హెడ్‌కోచ్ రాహుల్ ద్రావిడ్ ఐపీఎల్‌లో పునరాగమనం చేయనున్నట్టు సమాచారం. ఐపీఎల్‌లో వచ్చే సీజన్ నుంచి రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి ద్రావిడ్ హెడ్‌కోచ్ బాధ్యతలు చేపట్టనున్నాడని తెలుస్తోంది. 2012, 2013 సీజన్‌లలో రాజస్థాన్‌కు సారథిగా వ్యవహరించిన ద్రావిడ్.. ఆ తర్వాత రెండేండ్ల పాటు ఆ జట్టుకు మెంటార్‌గానూ పనిచేశాడు.అతడు మళ్లీ రాజస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం.

## నేటి నుంచే దులీప్ ట్రోఫీ

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన దులీప్ ట్రోఫీకి గురువారం (సెప్టెంబర్ 5) నుంచి తెరలేవబోతోంది. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లలో చాలామంది ఈ టోర్నీలో పాల్గొననుండటంతో క్రికెట్ అభిమానుల చూపు దులీప్ ట్రోఫీపై పడనుంది. నాలుగు జట్లు (ఇండియా ఏ, బీ, సీ, డీ) తలపడబోయే ఈ ట్రోఫీకి బెంగళూరు (కర్నాటక), అనంతపురం (ఆంధ్రప్రదేశ్) ఆతిథ్యమివ్వనున్నాయి.

## పారాలింపిక్స్ ఆర్చరీలో భారత్‌కు తొలి పసిడి

# హర్విందర్ స్వర్ణ చరిత్ర

### అరుదైన రికార్డు సొంతం చేసుకున్న సింగ్

### అథ్లెటిక్స్‌లో పాంచ్ పటాకా ..హైజంప్, జావెలిన్ త్రోలో డబుల్ ధమాకా



**ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ పతకాల వేట దిగ్విజయంగా కొనసాగుతున్నది. యువ ఆర్చర్ హర్విందర్‌సింగ్ కొత్త చరిత్ర లిఖించాడు. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న పసిడి పతకాన్ని ఒడిసిపట్టుకుంటూ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. టోక్యోలో కాంస్య కాంతులు విరజిమ్మిన ఈ హర్యానా ఆర్చర్.. పారిస్‌లో పసిడి పతకంతో వెలుగులు అద్దాడు. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో అపజయమన్నదే లేకుండా ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన హర్విందర్ ఓవరాల్‌గా సుదీర్ఘ ఒలింపిక్స్ చరిత్రలో తొలి స్వర్ణాన్ని అందించాడు. తామేం తక్కువ కాదన్నట్లు అథ్లెటిక్స్‌లో భారత్ పాంచ్ పటాకా మోగించారు. హైజంప్, జావెలిన్‌త్రోలో మన పారా అథ్లెట్లు డబుల్ ధమాకాతో చెలరేగగా, షాట్‌పుట్‌లో సచిన్ వెండి పతకం ఖాతాలో వేసుకున్నాడు. మొత్తంగా ఆరు పతకాలతో టార్గెట్-25 రేసులో 22 పతకాలతో భారత్ దూసుకెళుతున్నది.**

## ఆర్చరీలో భారత్‌కు తొలి స్వర్ణం



ఆర్చరీలో భారత ఆర్చర్ హర్విందర్ సింగ్ సంచలన ప్రదర్శనతో స్వర్ణం గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఓపెన్ ఫైనల్‌లో హర్విందర్ సింగ్ 6-0తో లుకాస్ సిస్‌జెక్ (పోలండ్) ను ఓడించడంతో పారాలింపిక్స్ ఆర్చరీ ఈవెంట్స్‌లో స్వర్ణం గెలిచిన మొదటి భారత ఆర్చర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. ర్యాంకింగ్ రౌండ్‌లో 637 పాయింట్లతో 9వ స్థానంలో నిలిచిన అతడు.. ఒక్కో మెట్టు ఎక్కుతూ క్వార్టర్స్ చేరాడు. క్వార్టర్స్‌లో 6-2తో హెక్టార్ జులియొ (కొలంబియా)ను ఓడించాడు. సెమీఫైనల్స్‌లో 7-3తో మహ్మద్ రెజా అరబ్ (ఇరాన్)ను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించాడు. ఇక ఫైనల్‌లో హర్విందర్ తొలి సెట్‌లో (మూడు షాట్లు)నే 9, 9, 10తో 28 పాయింట్లు స్కోరు చేయగా ప్రత్యర్థి 24 పాయింట్లే రాబట్టాడు. రెండో సెట్‌లో బాణాన్ని రెండు సార్లూ పది పాయింట్ల సర్కిల్‌లోకి పంపిన హర్విందర్.. విజయాన్ని దాదాపుగా ఖాయం చేసుకున్నాడు. ఇక మూడో సెట్‌లో లుకాస్ 25 పాయింట్లే చేయగా హర్విందర్ 29 పాయింట్లు సాధించి విజయంతో మ్యాచ్‌ను ముగించాడు. టోక్యోలో కాంస్యం గెలిచిన ఈ హర్యానా ఆర్చర్‌కు పారిస్‌లో పసిడి దక్కడం విశేషం.

పారిస్: పారాలింపిక్స్ ఆరంభంలో షూటర్లు, షట్లర్లు భారత్‌కు పతకాల పంట పండిస్తే గత రెండ్రోజుల నుంచి ఆ బాధ్యతను మన అథ్లెట్లు తీసుకున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల హైజంప్, జావెలిన్ త్రోలో దేశానికి మరో నాలుగు పతకాలు దక్కాయి. ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా జరిగిన పురుషుల హైజంప్ (టీ63)లో శరద్ కుమార్, తంగవేలు మరియప్పన్ రజత, కాంస్యాలతో మెరిశారు. తంగవేలుకు ఇది వరుసగా మూడో పారాలింపిక్స్ పతకం కాగా శరద్‌కు రెండోది. జావెలిన్ త్రోలో అజిత్, సుందర్ విసిరిన బరిసె.. వెండి, కాంస్యాలను పట్టుకొచ్చింది. బుధవారం జరిగిన పురుషుల షాట్‌పుట్ (ఎఫ్46)లో సచిన్ ఖిలారి సిల్వర్ గెలిచి భారత పతకాల సంఖ్యను 21కి పెంచాడు. ఆర్చరీలో భారత్‌కు హర్విందర్ సింగ్ తొలి స్వర్ణం అందించాడు.

### మీ 'దూకు'డు.. సాటెవ్వడు!

పురుషుల హైజంప్ ఈవెంట్‌లో భారత అథ్లెట్లు దుమ్మురేపారు. 8 మంది పాల్గొన్న ఫైనల్‌లో భారత్.. రజతం, కాంస్యంతో పాటు నాలుగో స్థానంలోనూ నిలిచి సత్తా చాటింది. శరద్ (టీ42) 1.88 మీటర్ల ఎత్తుకు దూకి పారాలింపిక్స్‌లో రికార్డులు బ్రేక్ చేశాడు. దీంతో టోక్యోలో తంగవేలు మరియప్పన్ నమోదుచేసిన 1.86 మీటర్ల రికార్డు కనుమరుగైంది. శరద్‌కు ఇది వరుసగా రెండో పారాలింపిక్స్ పతకం. గతంలో అతడు టోక్యోలోనూ కాంస్యం సాధించాడు. ఇక రియోలో స్వర్ణం, టోక్యోలో రజతం గెలిచిన తంగవేలు.. పారిస్‌లో కాంస్యం సాధించి వరుసగా మూడు పారాలింపిక్స్‌లో పతకాలు గెలుచుకుని ఈ ఘనత సాధించిన తొలి భారత పారా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించాడు. పారిస్‌లో తంగవేలు 1.85 మీటర్ల ఎత్తు దూకాడు. అమెరికా అథ్లెట్ ఫ్రెచ్ ఎజ్రా (1.94 మీటర్లు) అగ్రస్థానంతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన కుమార్ శైలేష్ నాలుగో స్థానంలో నిలిచాడు.




### బల్లెం వీరుల 'డబుల్' ధమాకా

పురుషుల జావెలిన్ త్రోలో ఇది వరకే సుమిత్ అంటిల్ (ఎఫ్64) భారత్‌కు పసిడి వెలుగులు పంచగా ఎఫ్46 క్రీడాంశంలోనూ మన అథ్లెట్లు దేశానికి వెండి, కాంస్య పతకాలు అందించారు. ఐదో ప్రయత్నంలో ఈటెను 65.62 మీటర్ల దూరం విసిరిన అజీత్ సింగ్ రజతం దక్కించుకున్నాడు. నాలుగో ప్రయత్నంలో 64.96 మీటర్లతో గుర్జార్ సుందర్ సింగ్ కాంస్యాన్ని ముద్దాడాడు.

## సచిన్ వెండి కొండ



హైజంప్, జావెలిన్ త్రోలో మన అథ్లెట్ల విజయాలు ఇచ్చిన స్ఫూర్తితో పురుషుల షాట్‌పుట్ (ఎఫ్46) బరిలో నిలిచిన ఖిలారి సచిన్ సర్జేరావు దేశానికి మరో రజతాన్ని అందించాడు. ఫైనల్‌లో సచిన్.. ఇనుపగుండును 16.32 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. గోల్డ్ మెడల్ కొట్టిన స్టీవర్ట్ గ్రెగ్ (16.38) కంటే 0.06 మీటర్ల దూరం తక్కువ విసరడంతో సచిన్ బంగారు పతకాన్ని కోల్పోవాల్సి వచ్చింది. బకొవిచ్ లుకా (క్రొయేషియా.. 16.27) కాంస్యం నెగ్గాడు. ఈ ఈవెంట్‌లో మనదేశానికి చెందిన మహ్మద్ యసీర్, కుమార్ రోహిత్ 8,9 స్థానాలలో నిలిచారు.




## రైతు బిడ్డ పసిడి వేట

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రతీ వీరుని విజయం వెనుక ఒక అలుపెరుగని గాథ ఉంటుంది. ఎన్నో కష్టనష్టాలకు ఒర్చుకున్న వైనం ఆ అపూర్వ విజయానికి సోపానం అవుతుంది. అన్ని అవయవాలు ఉన్నవాళ్లే ఆపసోపాలు పడుతున్న వేళ దివ్యాంగుడైన హర్విందర్‌సింగ్ అద్భుతమే చేశాడు. పారిస్ పారాలింపిక్స్‌లో పసిడి పతకంతో కొత్త చరిత్రకు నాంది పలికాడు. వైకల్యాన్ని ఏ మాత్రం లెక్కచేయకుండా ఆర్చరీలో అరుదైన ఘనత సొంతం చేసుకున్న సింగ్ ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని చెప్పాలి. హర్యానాలోని కైతాల్ జిల్లా అజిత్‌నగర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన హర్విందర్‌సింగ్ ఏడాదిన్నర వయసులో ఉన్నప్పుడు డెంగ్యూకు చికిత్స తీసుకుంటున్న సమయంలో మందుల ప్రభావంతో కాళ్లు చచ్చుబడి పోయాయి. కొడుకు ఆసక్తి గమనించిన అతని తండ్రి వ్యవసాయ పొలంలో ఆర్చరీ రేంజ్ ఏర్పాటు చేశాడు. టోక్యో పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన సింగ్..పారిస్‌లో పసిడితో కోట్లాది మందికి ప్రేరణగా నిలిచాడు.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 60 | 44 | 27 | 131 |
| 2 | బ్రిటన్ | 33 | 25 | 16 | 74 |
| 3 | అమెరికా | 25 | 25 | 11 | 61 |
| 4 | నెదర్లాండ్స్ | 16 | 7 | 5 | 28 |
| 5 | ఫ్రాన్స్ | 15 | 17 | 18 | 50 |
| 6 | బ్రెజిల్ | 15 | 14 | 27 | 56 |
| 16 | భారత్ | 4 | 8 | 10 | 22 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

# సినీ తారల దాతృత్వం

## వరద బాధితులకు తారల ఆపన్న హస్తం

## పవన్‌కల్యాణ్ 6 కోట్ల భూరి విరాళం

## ప్రభాస్ రెండు కోట్ల విరాళం



తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం సినీ తారల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర తారలు భారీ విరాళాలను ప్రకటిస్తూ తెర మీదే కాదు.. నిజ జీవితంలో కూడా తాము హీరోలమేనని నిరూపించుకుంటున్నారు. ఇప్పటికే బాలకృష్ణ, ఎన్టీఆర్, మహేష్‌బాబు వంటి అగ్ర హీరోలు ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి 50 లక్షల చొప్పున కోటి రూపాయల విరాళాలతో తమ పెద్ద మనసును చాటుకున్నారు. ఇప్పుడు వీరి వరుసలో పవన్‌కల్యాణ్, చిరంజీవి, ప్రభాస్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, నాగార్జున, అశ్వనీదత్, అలీ తదితర సినీ ప్రముఖులు భారీ విరాళాలతో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రభాస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెరో కోటి రూపాయల చొప్పున రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి యాభై లక్షల చొప్పున కోటి విరాళాన్ని అందజేయనున్నట్లు చిరంజీవి తెలిపారు. అక్కినేని నాగార్జున, అల్లు అర్జున్, రామ్‌చరణ్ రెండు రాష్ట్రాలకు కలిపి తలో కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. అగ్ర హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కోటి రూపాయల చొప్పున రెండు కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నందున అక్కడి వరద బాధిత 400 గ్రామపంచాయతీలకు 4కోట్ల విరాళాన్ని అందిస్తున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. నిర్మాత అశ్వనీదత్ 20 లక్షలు, యువహీరో సాయిదుర్గతేజ్ 20లక్షలు. నటుడు అలీ 6 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

## 50కోట్ల బడ్జెట్.. 500కోట్ల కలెక్షన్స్



కథలో విషయం ఉంటే చాలు తారల ఇమేజ్‌తో సంబంధం లేకుండా సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని బాలీవుడ్ చిత్రం 'స్త్రీ-2' నిరూపిస్తున్నది. 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ హారర్ థ్రిల్లర్ కేవలం 20 రోజుల్లోనే 515కోట్ల వసూళ్లను రాబట్టి సంచలనం సృష్టించింది. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావు, అభిషేక్ బెనర్జీ ప్రధాన పాత్రల్ని పోషించారు. 2018లో వచ్చిన 'స్త్రీ' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమాలోని హారర్ ఎలిమెంట్స్, కథలోని అనూహ్య మలుపులు, తలలేకుండా కేవలం మొండెంతో కనిపించే విలన్ సర్కతా పాత్ర హైలైట్‌గా నిలుస్తున్నది. 'స్త్రీ-2' చిత్రం బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందని, దసరా వరకు లాంగ్‌రన్ ఉంటుందని ఫిల్మ్ ట్రేడ్ ఎనలిస్ట్ తరణ్ ఆదర్శ్ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు.



# హుషారెత్తించే గీతం



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర-1' ఈ నెల 27న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. 'చుట్టమల్లె..' అనే పాటకు యూట్యూబ్‌లో రికార్డు స్థాయి వీక్షణలు దక్కాయి. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతానికి సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'దావుడి' అనే మూడో పాటను బుధవారం విడుదల చేశారు. ఫాస్ట్‌బీట్‌తో సాగిన ఈ పాటలో నాయకానాయికలు ఎన్టీఆర్, జాన్వీ కపూర్‌ల నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. రామజోగయ్యశాస్త్రి రచించిన ఈ గీతాన్ని నకష్ అజీజ్, ఆకాశ ఆలపించారు. ప్రేక్షకుల్ని హుషారెత్తించే గీతమిదని, థియేటర్లో అభిమానులతో డ్యాన్సులు చేయిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. సైఫ్‌అలీఖాన్, ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.

# పర్సనల్ లైఫ్‌కు దగ్గరి పాత్ర

తెలుగు చిత్రసీమలో అనతికాలంలోనే అగ్ర కథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది పంజాబీ భామ మీనాక్షి చౌదరి. ప్రస్తుతం ఈ అమ్మడికి చేతినిండా సినిమాలున్నాయి. తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ సరసన ఆమె నటించిన తాజా చిత్రం 'GOAT' ( గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి పాత్రికేయులతో మాట్లాడుతూ 'విజయ్ వంటి అగ్ర హీరోతో కలిసి నటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను ఆధునిక భావాలు కలిగిన కాలేజీ అమ్మాయిగా కనిపిస్తా. నా పాత్ర సరదాగా సాగుతుంది. నా వ్యక్తిగత జీవితానికి కూడా రిలేట్ అయ్యే క్యారెక్టర్ ఇది. కథాగమనంలో కూడా నా పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది' అని చెప్పింది. వరుసగా వస్తున్న సినిమా ఆఫర్ల గురించి మాట్లాడుతూ 'గత ఏడాది అంగీకరించిన సినిమాలు ఈ ఏడాది వరుసగా రిలీజ్‌కు సిద్ధమవుతున్నాయి. సినిమాల ఎంపిక విషయంలో స్క్రిప్ట్‌కే తొలి ప్రాధాన్యత. ఆ తర్వాతే నా క్యారెక్టర్ గురించి ఆలోచిస్తా' అని మీనాక్షి చౌదరి పేర్కొంది. తన తదుపరి సినిమాల గురించి చెబుతూ..''మెకానిక్ రాకీ'లో మిడిల్‌క్లాస్ అమ్మాయిగా కనిపిస్తా. 'లక్కీ భాస్కర్'లో తల్లి పాత్రలో నటించా. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమాలో పోలీస్ పాత్రను పోషిస్తున్నా' అని పేర్కొంది.



చిత్రం

# ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది

'ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ సినిమా ఇది. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. పేరెంట్స్ అందరూ వారి పిల్లలతో కలిసి చూడాల్సిన సినిమా' అన్నారు నాని. సోమవారం జరిగిన '35-చిన్న కథ కాదు' సినిమా ప్రీరిలీజ్ వేడుకను ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నందకిషోర్ ఈమాని దర్శకుడు. రానా సమర్పకుడు. ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ..ఇండస్ట్రీలో తనకు రానా మంచి మిత్రుడని, న్యూటాలెంట్‌ను ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తుంటాడని, ప్రతీ కుటుంబం ఈ సినిమాతో కనెక్ట్ అవుతుందని అన్నారు. తనకు స్కూల్ రోజుల్లో లెక్కల సబ్జెక్ట్ అస్సలు నచ్చేది కాదని, ఈ కథ విన్నప్పుడు తన బయోపిక్ అనుకున్నానని రానా చెప్పారు. ఈ చిత్రాన్ని అమ్మలందరికీ అంకితమిస్తున్నానని కథానాయిక నివేద థామస్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# 'జనక అయితే గనక' వాయిదా



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో 'జనక అయితే గనక' సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు అగ్ర నిర్మాత దిల్ రాజు ప్రకటించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ నెల 7న విడుదల కావాల్సి ఉంది. రెండు రాష్ట్రాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని దిల్‌రాజు పేర్కొన్నారు. సుహాస్, సంగీర్తన జంటగా నటించిన 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. వినోదాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.